# చిత్రా

"నీ కథ తిరిగొచ్చిందోయ్."

గదికి తిరిగివచ్చిన కావ్యశ్రీ, ప్రూఫ్ రుద్రారావుతో చెప్పాను.

"ఏ కథ?"

రుద్రారావు కంఠంలో ఏ మాత్రం ఆసక్తి లేదు.

"దాని పేరు 'తిరిగొచ్చిన కథ' అనుకుంటాను."

"అనుకుంటాననే బదులు, విప్పి చూసానని ఏడవ రాదూ?" అన్నాడు రుద్రారావు విసుగ్గా.

"బుక్ పోస్టులో, తెరచివున్న కవరులోవస్తే చూసానంతే. నీకు తెలుసు నా కా కథలు, కాకరకాయలంటే ఏ మాత్రం పడదని."

రెండు నిముషాల తర్వాత అన్నాడు రుద్రారావు, గదిలోని గోడలకి, కుర్చీలకి చెప్తున్నట్లుగా.

"ఇంకా నాలుగు కథలున్నాయి పరిశీలనలో."

"ఇంకా నాలుగు కవర్లు తిరిగి రావాలన్నమాట."

"ఛట్. వాటిలో ఒకటి ఫ్లూర్ షాట్. రెండు ఫర్వాలేదు, మిగిలినవి అటూ, ఇటూ."

నువ్వా కథలు వ్రాయడంఆపి ఇకనయినా పుస్తకాలు చేతబట్టు కావ్యశ్రీ. అప్పుడు గాని వంటబట్టదు నీకు. ఆ డిపార్ట్‌మెంటల్ పరీక్ష అయిందనిపిస్తే, జీతం పెరుగుతుంది ముందర. తర్వాత ఎప్పటికయినా ప్రమోషన్ తప్పకుండా వస్తుంది.

రుద్రారావుకి నేను చెప్పే హితబోధలు ఏ మాత్రం రుచించవు. నా మీద ఎగిరాడు వెంటనే.

"ఛట్, నీది కళా హృదయంకాదు, ఒట్టి గుమాస్తా బుర్ర నీది. ఎన్ని వారపత్రికలు ఎన్ని మాసపత్రికలు వస్తున్నాయో తెలియదు. ఎవరెవరు వ్రాస్తున్నారో తెలియదు."

అలా తెలియటంవల్ల నాది కళాహృదయం ఎలా అవుతుందో అంతుబట్టలేదు నాకు. తెలియకపోవటంవల్ల వచ్చే నష్టం అంతకన్నా అంతుబట్టలేదు.

"నా వంద ఎప్పుడు తీరుస్తావ్ ?" అడిగాను.

"అప్పుగా తీసుకున్నదా ?" అడిగాడు.

"అవును పూరికే యివ్వలేదు అది"

"తీరుస్తాలే"

"అది తీర్చేందుకు ఓ మంచి వుపాయం చెప్పనా ?" అడిగాను.

"చెప్పు"

"కథలు వ్రాయటం ఆ బాకీ తీరేదాకా తాత్కాలికంగా వాయిదా వెయ్యి. ఆ కథలని పంపించేందుకు పెట్టే పోస్టేజిఖర్చు, కాగితాలు, కవర్ల ఖర్చు దాచావంటే, నాలుగయిదు నెలల్లో నా బాకీ తీరుతుంది. తర్వాత నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో."

ఇంతేనా నీ తెలివి తేటలు అన్నట్టుగా సానుభూతిగా నవ్వి అన్నాడు రుద్రారావు.

"ఒక్క కథ ప్రచురింపబడితేచాలు, రెండు కథలు వేసుకుంటే ఎక్కువ. మూడో కథ కూడా పడితే నీ బాకీ నీకు తీర్చేయడానికి సరిపడ డబ్బు మిగులుతుంది నాకు."

"రెమ్యునరేషనా ?"

"అవును పారితోషికాలు రాగానే నీ అప్పు తీర్చేస్తాను, మంచి కథ వ్రాసే మూడ్‌లో వున్నప్పుడు నన్ను ఆట్టే యిబ్బంది పెట్టకు."

"అసలు నీ కథలు పడేదెప్పుడూ ?"

"అది తెలియకేగా నేను ఇలా బాధపడేది. క్రిందటి సంవత్సరం ఆట్టే మంచిది కాదు. నాకు అన్ని విషయాల్లో చుక్కెదురే అయింది. యీ సంవత్సరం మాత్రం నేను పట్టినదల్లా బంగారమే అవుతోంది."

చిన్నగా నిట్టూర్చాను. దుర్వ్యసనాలలో కథలు వ్రాయడం చేర్చవందుకు విచారిస్తూ లాటరీ టిక్కెట్లు

కొన్న ప్రతీవాడు తనకి బహుమతి వస్తుందన్న ఆశతో వుంటాడు. కథ పత్రికకి పంపిన ప్రతీ రచయితా, అలాగే పడుతుందనే ఆశతో వుంటారు.

చివరికి ఫలితం మరోలా వున్నా, కొనేవాడు లాటరీ టికెట్లు కొనకమానడు వ్రాసేవాడు కథలు వ్రాయకా మానడు. ఆశ యిద్దరినీ పట్టి పీడిస్తుంది.

రుద్రారావు వ్రాసేది సాధారణంగా రాత్రుళ్ళే. దీపం వుంటే నాకు నిద్రపట్టదు. టేబిల్ లేంప్ కొనమంటే కొనడు. రాత్రి పన్నెండయినా, గబగబా తెల్ల కాగితాలు నలుపు చేస్తూ, వ్రాస్తూనే వుంటాడు కథ.

దీపం ఆర్పేయమని నేను అడిగితే గబగబ అప్పటి దాకా వ్రాసిన కథ టూకీగా చెప్పి (నేను కోప్పడటం అల వాటు చేసుకున్న దగ్గర నుండి చదివి వినిపించడం మానే శాడు; రూమ్ ఖాళీ చేస్తాననే నా బెదిరింపు కూడా ఇందుకు సహాయపడింది. మరోగడి కోసం ఇంకా వెదుకుతూనేవున్నాను) తర్వాత ఏంచేస్తే బావుంటుంది అని అడుగుతాడు. నాలు గయిదు విధానాలు చెప్పి.

"అందర్నీ చంపేసి లైటార్పెయి" అంటాను నేను. కరెంట్ ఆ విధంగా వృధా చేస్తున్న విసుగోకని ఇంటి యజ మాని వుదారతకి చింతిస్తూ

రుద్రారావులో రచనాశక్తి లేదని నా నమ్మకం. వుంటే వ్రాసిన ఏభై కథల్లో కనీసం ఒకటయినా పడివుండేది తప్పకుండా.

కథ తిరిగొస్తే 'అయ్యో' అనుకునే స్టేజ్ కూడా దాటి పోయిన రుద్రారావు చెప్పాడు నాకు, వర్షాకాలం చివరలో ఓ సంగతి.

రుద్రారావుకి పరిచయమున్న ఓ రచయిత పెళ్ళి జరుగుతోంది వారం రోజుల్లో ఆ పెళ్ళికి వెళ్ళబోతూ, నా దగ్గర పాతిక అప్పు తీసుకొన్నాడు.

"ఓ మంచి కథ వ్రాస్తాను పెళ్ళినుండి తిరిగిరాగానే. అది నూటికి నూరుపాళ్ళు అంగీకరించబడే కథ" చెప్పాడు.

"తగలడు" అన్నాను నేను రుద్రారావు రచనా వ్యాసంగంతో, ఇలాంటి కబుర్లతో విసిగిపోయి.

"నీకు ఇప్పుడు తెలియదులే" అని భావయుక్తంగా నవ్వి వెళ్ళిపోయాడు.

రుద్రారావు పెళ్ళినుంచి తిరిగి వచ్చే నాలుగురోజులు సుఖంగా నిద్రపొయ్యాను

అయిదో రోజు తిరిగి వచ్చాడు.

"ఆఫీస్ సంగతు లేమిటి ?" అడిగాడు.

"ఏం లేవు" చెప్పాను.

"నువ్వెలా వున్నావ్ ?" అడిగాడు.

"దోమలా బాధించే నువు లేకపోవడంవల్ల హాయిగా నిద్రపోయాను యీ నాలుగు రోజులూ"

"ఓ బ్రహ్మాండమైన కథావస్తువు దొరికింది. చక్కగా వ్రాశాను. రాత్రికి తుది మెరుగులుదిద్ది. రేపుకాపీచేసి పంపిస్తున్నాను. తప్పకుండా వేసుకుంటారు దీన్ని."

"మంచిదే వేసుకుంటే" అన్నాను నిర్లిప్తంగా.

"మామూలుగా కాదు ! ప్రయిజ్ ఇచ్చి వేసుకుంటారు తెలుసా ? కథల పోటీకి పంపుతున్నాను" గర్వంగా చెప్పాడు.

"నీది ఇంతవరకు ఒక్క కథయినా వేసుకోలేదు కదా ఎవరూ. బహుమతి ఎలా వస్తుంది ?"

"యీసారి తప్పదు. ఓ గొప్ప చిట్కా ఆలోచించాను. దాన్ని అమలు జరుపుతున్నాను. నీవే చూస్తావుగా."

"ఏమిటా చిట్కా ?"

"అమ్మో ! ముందే చెప్పేస్తే నువ్వుకూడా నాలానే చేసేస్తావ్."

"రచయిత పెళ్ళికి కదా నువు వెళ్ళింది."

"అవును."

"అతన్ని బ్రతిమాలి ఏ కథయినా రాయించి తెచ్చుకున్నావా ?"

"అతని పెళ్ళికయితే వెళ్ళాను గాని, కథల వూసే ఎత్తలేదు నేనసలు అతని దగ్గర."

"మరేమిటా చిట్కా ?"

"వేచి చూడుడు"

"బహుమతి వస్తే నా అప్పు తీరుస్తావా ?"

చిన్నగా నవ్వి అన్నాడు రుద్రారావు.

"గుడ్. నీకూ ఆశ కలిగిందన్నమాట. బహుమతి

వస్తే అన్నదాకా వచ్చావ్. వస్తే కాదు. వస్తుంది. నీ రెండొందలూ నీకు ఇచ్చేస్తాను కావాలంటే పైన యింకో వంద కూడ ఇస్తాను అప్పుకింద."

"రాత్రి మళ్ళీ లైట్ వేసి చంపుతావా !"

"నువు ఒకందుకు సంతోషించాలి ది బెస్టు స్టోరీ ఆఫ్ ది యియర్ —యీ సంవత్సరం అంతటికీ గొప్పకథని యీ గదిలో. నీ సన్నిధిలో వ్రాయబోతున్నందుకు నువు సంతోషించాలి నిజానికి"

"టు హెల్ విత్ యువర్ స్టోరీస్"

"ఛట్. నిజంగా గొప్పకథ. గుండెలు పిండే సెంటిమెంటల్ శైలి, శిల్పం, భాష పాత్రలు అన్నీ అపూర్వం. అమోఘం."

"తగలడు" అన్నాను.

* * * *

నిజమే !

నా కళ్ళని నేనే నమ్మలేకపోయాను.

ఇంటికి వెళ్ళాను నేను శెలవుపెట్టి. ప్రతీ దీపావళికీ ఇంటికి వెళ్ళడం ఆనవాయితీ నాకు చెల్లాయికి పుస్తకాలంటే ఇష్టం. ప్రతీ పత్రికా చదువుతుంది.

దీపావళి పండుగరోజు చెల్లెలు తిరగేస్తున్న వారపత్రిక చూస్తుంటే నాకు రుద్రారావు చెప్పిన సంగతి గుర్తుకు వచ్చింది. నవ్వుకున్నాను రుద్రారావు నమ్మకానికి.

నమ్మకం లాటరీ టిక్కెట్ కొనిపించడమే కాదు. కథ వ్రాయిస్తుంది. ఇంకా చాలాచాలా చేయిస్తుంది. మనిషికి కావాల్సింది నమ్మకం, పట్టుదల, ఉత్సాహం.

"నువ్వు ఏ ఆఫీసులో పనిచేస్తున్నావ్ ?" అడిగింది చెల్లాయ్ మధ్యాహ్నం మూడు గంటలకి.

చెప్పాను. చెప్పి, దేనికని అడిగాను.

"మీ ఆఫీస్‌లో కావ్యశ్రీ అనే రచయిత వున్నాడా? అడిగింది.

"వున్నాడు ఆ దుర్మార్గుడే నారూమ్ మేట్ కూడా"

"రుద్రారావు కదా అసలు పేరు ?"

"అవును. నీ కెలా తెలుసు ఇవన్నీ ?"

"ఆయితే నీకు తెలియదా అతనికి బహుమతి వచ్చినట్లు ?"

"బహుమతి వచ్చిందా ! దేనికి ? కథకా !" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును కావ్యశ్రీ కథకి మొదటి బహుమతి ఇచ్చారు"

"నేను నమ్మను వాడు అప్పులు చేయటంతప్ప కథలు వ్రాయడం చేతనవదు నాకు తెలిసినంతవరకు."

"కావాలంటే నువ్వే చూడు"

చెల్లాయ్ ఆ వారపత్రికని అందించిందినాకు. అందు కుని చూశాను.

నిజమే !

నా కళ్ళని నేనే నమ్మలేకపోయాను.

మొదటి బహుమతి పొందిన రచయిత కావ్యశ్రీ.

రచయిత అసలు పేరు రుద్రా రావు ! !

మొదటి బహుమతి గ్రహీత ఫోటో రుద్రారావుదే!!!

ఫోటో క్రింద వ్రాసినవివరాలన్నీ సరిగ్గాసరిపోయ్యాయి. కథపేరు 'గడమంచి'

సంపాదకుడు ఆ కథ గురించి వ్రాస్తూ అది చాలా అరుదయిన మంచి కథనీ, శైలి, శిల్పం, పాత్రలు, మొదలుం తుది అన్నీ ఎంతో చక్కగా, విమర్శకి అతీతంగా వున్నా యని, రచయితకు అభినందిస్తున్నాననీ వ్రాశాడు.

పుస్తకం తిరగేసి జోక్స్, సినిమా బొమ్మలు చూసి, ఆ కథ 'గడమంచి' చదివాను పూర్తిగా. బాగానే వుందని పించింది నాకు.

"చాలా బాగా వ్రాశాడన్నయ్యా. నాకోసారి పరి చయం చెయ్యాలినువ్వు. మొపాసా కథలాగావుంది. గుండెలు పిండే కథ ఇది. చివరలో హెన్రీట్విస్టే కూడా వుంది" అన్నది చెల్లాయ్.

"వీడి కసలు మంచి కథలు వ్రాయడం రాదు. ఇది వీడు వ్రాసిన కథ మాత్రం కాదు, ఆ సంగతి గట్టిగా చెప్ప గలను నేను.

"ఛ ఇంతమంచి కథ నీ స్నేహితుడు కాకపోతే మరె వరు వ్రాయగలరు?" అన్నది చెల్లాయ్.

"వాడేదో చిట్కా గురించి చెప్పాడునాకు. సరిగ్గా గుర్తులేదుకాని, తన కథ తప్పనిసరిగా పడే చిట్కా ఏదో ఆలోచించానని చెప్పాడు."

"వెళ్ళగానే అయితే ఆ చిట్కా ఏదో అడిగి నాక్కూడా కొంచెం రాయి" అన్నది చెల్లాయ్. "రచయిత అయ్యేందుకు చిట్కాలు కూడా వుంటాయని నాకు ఇంతవరకు తెలియదు"

నాలో ఆత్రం మొదలయింది. రుద్రారావు అంత బావుండే, మొదటి బహుమతి తప్పకుండా పొందే కథని ఎలా వ్రాయగలిగాడో తెలుసుకోవాలనే ఆత్రం మొదలయింది నాలో

ఊహాగానం చేయసాగాను.

ఎడిటర్స్ రికమండేషన్స్ వప్పుకోరు.

డబ్బిచ్చి, ఏ రచయిత చేతయినా ఆ కథని వ్రాయించుకొని, తన పేరుమీద పంపి వుంటాడు.

అంతకంటే నాకు ఇంకేం తట్టలేదు, ఏంచేసి వుంటాడు యింక ?

* * *

"ఏం చేయలేదు."

సెలవ అవగానే తిరిగి వచ్చాక, రుద్రారావుని కలిశాను గదిలో. అడిగాను ఆ చిట్కా ఏమిటని.

"నువ్వు ఊహించిన వాటిల్లో ఏం చేయలేదు. చెత్త వూహాలు నీవి. పట్టి మట్టిబుర్ర నీది. ఆ విధంగా అయితే అందరికీ బహుమతి వస్తుంది."

"మరి ? నువు అంత మంచి కథ స్వయంగా వ్రాయ గలిగావంటే మాత్రం నమ్మను నేను."

"నిజమే. నేను వ్రాయలేదు ఆ బహుమతి పొందిన కథ" చెప్పాడు రుద్రారావు.

"మరి ఎవరు వ్రాసిపెట్టారు ?"

"రచయితలు !"

"ఎంతిచ్చుకున్నావ్ ?"

"నయాపైసాకూడా ఖర్చు కాలేదు."

"నయాపైసాకూడా పుచ్చుకోకుండా వూరికే రాసిచ్చారంటావా ?"

"చిత్రం !"

"అబద్ధం."

"అదే చిట్కా !"

"నీ చిట్కా నాకు అర్థం కాలేదు."

"నిజం గురూ ! ఆరుగురు గొప్ప రచయితలు తమ వూహాశక్తితో కల్పించిన కథ అది; ఒకరికి తెలియకుండా మరొకరు ఆ కథకి రూపాన్ని యిచ్చారు."

"ఎలా ? అది చెప్పవే ?"

"నేను మంచి వెరైటీ ప్లాట్స్‌తో కథలు వ్రాసే రచయిత. చక్కటి శైలిగల రచయిత. ముగింపు అద్భుతంగా వ్రాసే రచయిత, కథల్లో పాత్రలకి చక్కటి ట్రీట్‌మెంట్ ఇచ్చే రచయిత— ఇలా కథలోని ప్రతి విభాగానికి తనకి తానే సాటి అనిపించుకొనే ఆరుగురు రచయితలు నాకు సహాయపడ్డారు. విచిత్రం ఏమిటంటే..."

వింటూ ఉండి పోయాను రుద్రారావు చెప్పేది.

"ప్రతి ఒక్కరూ తాము నాకు సహాయపడుతున్నామనిగాని, మిగతా అయిదుగురు నాకు సహాయపడు తున్నారని గాని తెలుసుకోలేక పోయారు."

"నిజంగానా ?" అడిగాను.

"అవును. ప్రమాణం చెయ్యి. మరెవ్వరికీ – ఎప్పటికీ యీ చిట్కా చెప్పనని ప్రమాణం చెయ్యి. వాళ్ళచేత యే విధంగా నాకు సహాయం అందేలా చేశానో చెప్తాను."

"ఎవరి మీద ?"

"నీ మీదే ?"

వాడు చెప్పిన విధంగా ప్రమాణం చేశాక, చెప్ప సాగాడు రుద్రారావు.

"ఆ ఆరుగురు రచయితలు ఓ చోట కలుస్తే బావున్ననుకుంటూన్న సమయంలో నా రచయిత స్నేహితుడి పెళ్ళి అయింది. ఆ పెళ్ళికి యీ మిగతా ఆరుగురు రచయితలు వచ్చారు అదృష్టవశాత్తు.

"ముందర వెరైటీ ప్లాట్స్ వ్రాసే రచయితతో మాటలు కలిపి ఆయన వ్రాస్తున్న క్రొత్త కథల ప్లాట్స్ గురించి చూచాయగా తెలుసుకున్నాను. ఆ ప్లాట్స్‌ని మరో రచయితకి చెప్పాను నావిగా. వాటికి ముగింపు ఏ విధంగా వుంటే బావుంటుంది" సలహా అడిగాను. అద్భుతమయిన ముగింపులు వూహించ గలిగే ఆయన అన్నిటికీ ముగింపులు చెప్పాడు.

"ముగింపు సంపాదించాక పేర్లు అతికినట్లు పెట్టే సమర్థతగల మరో రచయితతో చర్చించి వాటికి సరయిన పేర్లు సంపాదించాను.

"ఓ కథ రెండు, మూడు గంటలసేపు ఓపికగా వ్రాసి శైలి చక్కగా వుండే రచయితకి దాన్ని చూపించాను. ఆయన ఘోరంగా విమర్శించారు నా శైలిని. ఆ విమర్శల కనుగుణ్యంగా తగిన మార్పులు చేసి మళ్ళీ చూపించాను వ్రాతప్రతిని. ఆయన మరిన్ని చోట్ల మార్పు చేసాడు. నా కోరిక మీరదట.

"ఇలా అందరు రచయితలను సంప్రదించి, నాకు సహాయం చేస్తున్నారనే అనుమానం కలుగకుండా, సాహిత్య చర్చ జరుపుతున్నట్లుగా నటించి ఆ కథని తయారు చేసాను."

"తెలివిగల వాడివోయ్" అన్నాను.

"ఆ బహుమతి పొందిన కథ నిజానికి ఆ ఆరుగురు రచయితల సమిష్టి కృషికి ప్రతిరూపం."

"నాకు చిన్నప్పుడు చదువుకున్న కథ జ్ఞాపకం వస్తోంది నీ తెలివి చూస్తూంటే ఆరేళ్ళ పసిపాప ఒకే సారి ఇద్దరు చదరంగం ప్రావీణులతో ఆట ఆడిందట, ఇద్దరినీ రెండు వేరు వేరు గదులలో వుంచి. ఆ పాపకు చదరంగం ఆడటం ఆట్టే రాదు. ఒకరి ఎత్తుని మరొకరి మీద వేసి, తను కేవలం ఇంటర్ మీడియర్‌గా వుండి పోయింది. అలాగే నువు ఈ రచయితలమధ్య మధ్యవర్తిగా వుండి మంచికథనొకదాన్ని సృష్టించావ్."

"ఒక్కటే కాదు ఇంకా అరడజను ప్లాట్స్ దాకా రెడీగా వున్నాయి."

"నువు రచయితవి కావుకదు! అసలా మిగతా అసలయిన రచయితలు నీతో ఎలా సాహిత్యచర్చ జరిపారు?" అడిగాను కాస్తేపాగి.

"చచ్చుప్రశ్న, ఓ గొప్ప నవలా రచయిత్రి పేరు చెప్పి ఆ రచయిత్రి నా చెల్లెలిని, నాకు సాహిత్యం అంటే అభిరుచి వుందనీ రాసాను."

"హాతోస్మి"

"కాదు. కథకుడయ్యేందుకు చిట్కా. ఆ మిగతా ఆరుకథలు పూర్తయ్యేదాకా నేను నిద్రపోను. నిన్నూ నిద్ర పోనివ్వను"

***